నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, బుధవారం 21 ఆగస్టు 2024 | PEDDAPALLI



రుణమాఫీ కాకపోవడానికి మేమేం పాపం చేశామంటూ ప్రశ్నిస్తున్న ఆవునూరు రైతులు

# ఎగ్గొడితే ఊరుకోం

- 800 మంది రైతుల్లో సగం మందికి ఇవ్వరా..?
- ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేయాల్సిందే
- ఆవునూర్ రైతుల ఆగ్రహం
- 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్‌లో స్పష్టం
- ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సర్కారు తీరుపై ముస్తాబాద్ మండలం ఆవునూరు రైతులు మండిపడుతున్నారు. ఈ నెల 15 లోగా ₹2లక్షల రుణం మాఫీ చేస్తామని ప్రకటించి మాట తప్పిందని వాపోతున్నారు. పట్టా పాసు బుక్కుపై రుణం ఇచ్చినోళ్లే ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, సంబంధం లేని అంశాలతో మాఫీకి మంగళం పాడుతున్నారని, గ్రామంలో 800 మంది లోన్లు తీసుకుంటే సగం మందికి కూడా మాఫీ కాలేదని ఆవేదన చెందారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' గ్రామంలో ఫీల్డ్ విజిట్ చేయగా, తమ గోడు వెల్లబోసుకున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం అందరికీ రుణమాఫీ చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. అనేక కొర్రీలు పెట్టి మాఫీ ఎగ్గొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.





### ఇద్దరిలో ఒక్కరికి కూడా రాలే

ఊళ్లె ఇద్దరి పొత్తుల మూడెకరాల భూమి ఉంది. పంట పెట్టుబడి కోసం నా భార్య కవిత పేరు మీద ₹లక్షా50వేలు, నా పేరుమీద ₹2.25లక్షలు అప్పు తీసుకున్నం. ఆరునెలల కోసారి వడ్డీ కూడా కట్టుకుంటూ వస్తున్నం. రుణమాఫీ చేస్తమంటే ఎంతో సంతోష పడ్డం. ₹2 లక్షల వరకు రుణమాఫీ లిస్టులో మా ఇద్దరి పేర్లు లేవు. బ్యాంకుకు పోయి అడిగితే ఇద్దరు రుణం తీసుకున్నరు కాబట్టి రాలేదంటున్నరు. ఎవరి పట్టా పాసు పుస్తకాలు వేర్వేరుగా ఉన్నయి. ఇద్దరిలో ఒక్కరికైనా ఎందుకు మాఫీ కాదని అడిగితే అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. రేషన్‌కార్డు జాయింట్ ఉంటే రాదని చెపుతున్నరు. రుణం ఇచ్చేటప్పుడు వర్తించని నిబంధనలు మాఫీకి ఎందుకు? రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేయడమే.

**- కనవేని రాజు, కవిత దంపతులు, రైతులు**

### గోసపెడుతున్నరు

నాకు నాలుగెకరాల భూమి ఉంది. పంట సాగు పెట్టుబడులకు పైసల్లేక పాసుబుక్కు బ్యాంకులో కుదవపెట్టి ₹2.05లక్షలు లోను తీసుకున్న. అది వడ్డీతో కలిపి ₹2.40లక్షలైంది. వడ్డీ పూర్తిగా చెల్లించిన. అయినా నాకు రుణమాఫీ కాలేదు. ఇదేందని బ్యాంకుకు పోయి అడిగితే మాకేం తెల్వది. వ్యవసాయ శాఖ అధికారులను అడుగమన్నరు. వాళ్లను అడిగితే రుణం ₹2లక్షల ఐదువేలు ఉన్నందున రాలేదంటున్నరు. ₹5 వేలుంటే ఏందీ? ₹పది వేలుంటే ఏందీ? ప్రభుత్వం చెప్పింది ₹2 లక్షల మాఫీ చేస్తామని కదా..? ఎక్కువుంటే మేమే కట్టుకుంటం కదా! అని నిలదీస్తే తర్వాత చూద్దామంటున్నరు. సర్కారు తీరు బాగాలేదు. మేం ₹కోటీ విలువైన ఆస్తి నీ వద్ద కుదువబెట్టినం. రెన్యూవల్ చేసేటపుడు మా బకాయిలు వసూలు చేయరాదా? గిన్నీ కొర్రీలు పెట్టిన సర్కారుకు మంచిది కాదు.



**- నక్కదాసరి రవీందర్, రైతు (ఆవునూరు)**

### ₹64వేలు కూడా మాఫీ కాలే

నాకున్నది రెండు ఎకరాలు. నేను తీసుకున్నది ₹64వేలు. రైతులకు దశల వారీగా రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కేడీసీసీ బ్యాంకుకు పోయి అడిగితే రాలేదని బ్యాంకోళ్లు చెప్పిన్రు. వచ్చే లిస్టులో వస్తుందన్నరు. ఈసారైనా రుణమాఫీ జరుగుతుందేమోనని ఆశపడ్డ. వచ్చిన లిస్టులోనూ నాపేరు లేదు. ₹64వేలు కూడా మాఫీ కాలే. ఎందుకు రాలేదని బ్యాంకుకు వెళ్లి అడిగిన. ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అధికారుల వద్దకు పోతే పట్టించుకోరు. ప్రభుత్వం రైతు రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్నది. మా పరిస్థితేమో ఇట్లున్నది.



**- కుంబాల కవిత రైతు (ఆవునూరు)**

### మాకేం తెలుసంటున్రు

ఆవునూరులో మాకు నాలుగున్నర ఎకరాల భూమి ఉన్నది. కేడీసీసీ బ్యాంకులో ₹1.80లక్షల లోన్ తీసుకున్న. ₹రెండు లక్షల రుణమాఫీ అయితదంటే సంబుర పడ్డ. పాసుబుక్కు పట్టుకుని బ్యాంకుకు పోతే లిస్టులో నీపేరు లేదంటూ సార్లు చెప్పిన్రు. నేను రైతునే. నాకు పొలం ఉన్నది. లోను తీసుకున్న కదా? ఎందుకు మాఫీ కాదని అడిగితే, రేషన్‌కార్డు లేదని.. అందుకే రాలేదని చెప్పిన్రు. లోను ఇచ్చినపుడు రేషన్ కార్డు గురించి మాట్లాడనోళ్లు గిప్పుడెందుకు అడుగుతున్రని నిలదీసిన. ఏమో పో అమ్మ.. మాకేం తెలుసంటూ ఈసడించుకుంటున్రు. ఎవరికి చెప్పుకోవాలే నాబాధ. చేసోటోడు సక్కగ చెయ్యక గిన్ని తిప్పలు పెడుతుండు.



**- కుంబాల వజ్రమ్మ రైతు (ఆవునూరు)**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

# సైబర్ నేరగాళ్ల ఆట కట్టిస్తున్నాం

- బాధితులకు నగదు రిటన్ చేస్తున్నాం
- మత్తు పదార్థాలపై సీరియస్ యాక్షన్ తీసుకుంటున్నాం
- రాష్ట్రంలో మావోయిస్టులు లేరు
- కరీంనగర్‌లో డీజీపీ జితేందర్

కరీంనగర్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేసి సైబర్ నేరగాళ్ల ఆటకట్టిస్తున్నామని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. మత్తు పదార్థాలపై సీరియస్ యాక్షన్ తీసుకుంటున్నామని, గంజాయి, కొకెన్ వంటి మత్తు పదార్థాలను అరికడుతున్నామని చెప్పారు. రాష్ట్ర డీజీపీగా జితేందర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కరీంనగర్‌కు వచ్చారు. ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల, జగిత్యాల ఎస్పీలు అఖిల్ మహాజన్, అశోక్ కుమార్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఆ తర్వాత కమిషనరేట్‌లో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు డివిజన్, సర్కిల్ వారీగా తమ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు యాక్షన్ ప్లాన్ కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. విచారణ శాస్త్రీయ పద్ధతిలో జరగాలని, అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అనంతరం సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించి మావోయిస్టులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టులు బాగా నష్టపోయారని, తెలంగాణకు వచ్చే ప్రసక్తే లేదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అసలైన మావోలు లేరని, బయటకు వెళ్లిపోయారని అన్నారు. నకిలీ మావోయిస్టుల పేరుతో చెలామణి అవుతున్న వారిపై కఠినంగా వ్యహరిస్తున్నామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల విషయంలో సీఎం సీరియస్‌గా ఉన్నారని, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో గంజాయిని పెద్ద ఎత్తున పట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. సైబర్ నేరాల బారిన పడ్డవారు ఎవరైనా 1930 యూనివర్సియల్ నంబర్‌కు కాల్ చేస్తే తమ బ్యూరో తక్షణం స్పందిస్తున్నదని వెల్లడించారు. బాధితులకు ₹85 కోట్ల వరకు తిరిగి ఇప్పించామని, గడిచిన మూడు నెలల్లోనే ₹59 కోట్లు తిరిగి ఇప్పించామని స్పష్టం చేశారు. ఇటీవల కరీంనగర్‌లోనూ ₹1.60 లక్షలు ఒక బాధితుడికి ఇప్పించామని చెప్పారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇప్పటి వరకు 15 వేల కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి 13 వేల మందిని నియమించుకున్నామని, వీరంతా ఇప్పుడు శిక్షణలో ఉన్నారని తెలిపారు. రిటైర్‌మెంట్‌తో ఏర్పడే ఖాళీలకు నోటిఫికేషన్లు ఇవ్వాలంటే కనీసం రెండు సంవత్సరాలైనా పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల గురించి మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## 63వ జాతీయ రహదారిపై బైఠాయింపు

మెట్‌పల్లి, ఆగస్టు 20 : మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద 63వ జాతీయ రహదారిపై బైఠాయించారు. వీరికి బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. 'రైతులేనిదే రాజ్యం లేదు, ఇచ్చిన హామీలను అమలు చేయాలి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచుతారా? అని ప్రశ్నిస్తూనే గెలిపించిన రైతులే రాబోయే రోజుల్లో బొందపెడతారని హెచ్చరించారు. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా అటు బ్యాంకు అధికారులు, ఇటు వ్యవసాయాధికారులు చెప్పిందే చెబుతున్నారు తప్ప తమ రుణాలు మాత్రం మాఫీ కావడం లేదని, ₹2 లక్షలు కంటే ఎక్కువ ఉన్న రుణాన్ని చెల్లించకుంటే మాఫీ చేయరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటకు పైగా రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్ వచ్చేవరకు లేచేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో పలువురు రైతులను బలవంతగా లాక్కెళ్లి రాస్తారోకోను విరమింపజేసి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. కాగా, అప్పటికే అక్కడికి వచ్చిన జిల్లా వ్యవసాయాధికారి వాణికి రైతులు తమ డిమాండ్లతో వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ రైతు సంఘం నాయకులు మారు మురళీధర్‌రెడ్డి, కందరి ప్రతాప్‌రెడ్డి, మారు సాయిరెడ్డి,గూడ రాంరెడ్డి, నల్ల తిరుపతిరెడ్డి, పీసు తిరుపతిరెడ్డి, ఆకుల ప్రవీణ్, ఆకుల రాజారెడ్డి, బద్దం శేఖర్‌రెడ్డి, ఎలాల దశరథరెడ్డి,ఏనుగు గంగారెడ్డి, ఏలేటి ముత్తయ్యరెడ్డి, నోముల గంగాధర్, కాకర్ల రాజారెడ్డి, దోమకొండ చిన్న రాజన్న పాల్గొన్నారు.




మెట్‌పల్లి: పాత బస్టాండ్ వద్ద 63వ జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు

### భేషరతుగా రుణ మాఫీ చేయాలి



షరతులు లేకుండా భేషరతుగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి. ఇప్పటి వరకు సగం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదు. రైతులను మోసం చేసిన ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదు. హామీల అమలుకు వచ్చేసరికి ఏవేవో షరతులు పెట్టడం సరికాదు. రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రుణ మాఫీ సంపూర్ణంగా చేయాలి.

**- తీగల లింగారెడ్డి, చౌలమద్ది (మెట్‌పల్లి)**

### గెలిపించిన రైతులే బొందపెడుతరు

ఎన్నికలప్పుడు రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్తే రైతులు నమ్మి ఓట్లు వేసిన్రు. హామీలు ఇచ్చినప్పుడు బడ్జెట్ లేదని తెల్వదా?, తీరా మాఫీ టైమ్ వచ్చేసరికి ఖజానా లేదంటూ కొర్రీలు పెట్టడం ఎంత వరకు కరెక్ట్. ఇట్లజేస్తే గెలిపించిన రైతులే బొందపెట్టడం ఖాయం.



**- ఎలిసెగూడ పాపన్న, ఇబ్రహీంపట్నం (మెట్‌పల్లి)**

# రోడ్డెక్కిన రైతన్న

- రుణమాఫీ కోసం ఉమ్మడి జిల్లాలో రాస్తారోకోలు.. ధర్నాలు
- రోడ్లపై బైఠాయించి వ్యతిరేక నినాదాలు
- మద్దతు తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు
- షరతులు లేకుండా ₹2 లక్షలు మాఫీ చేయాలని డిమాండ్
- నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు
- రాఘవపేటలో ఓ రైతు ఆమరణ నిరాహార దీక్ష.. సాయంత్రం విరమణ
- కథలాపూర్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

## సర్కారు ధోఖాపై రణం

రుణమాఫీ విషయంలో సర్కారు ధోఖాపై ఉమ్మడి జిల్లా రైతులు ఆగ్రహించారు. మూడు విడుతలుగా ప్రకటించిన జాబితాల్లో పేర్లు లేక పోవడంపై ఆందోళన బాట పట్టారు. ఎక్కడికక్కడ నిరసనలు తెలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షలు వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి తీరా అమలులో ఆంక్షలు పెడుతుండడంపై మండిపడ్డారు. రోడ్లపైకి చేరుకుని రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళనబాట పట్టిన రైతులకు బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. పలు చోట్ల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మెట్‌పల్లిలో పలువురు రైతులను బలవంతంగా లాక్కెళ్లి రాస్తారోకోను విరమింపజేసి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. మల్లాపూర్ మండలం రాఘవపేటలో ఓ రైతు తన ఇంట్లోనే ఆమరణ నిరాహార దీక్షకు దిగగా, కథలాపూర్ రైతు వేదిక వద్ద మరో రైతు పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించాడు.



మెట్‌పల్లి: రైతును లాక్కెళ్తున్న పోలీసులు

### పురుగుల మందు డబ్బాతో నిరసన

కథలాపూర్, ఆగస్టు 20 : కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేటకు చెందిన ఏనుగు సాగర్‌రెడ్డికి ₹1.51,800 పంట రుణం ఉన్నది. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకుంటున్నాడు. మూడు విడుతల్లోనూ అది మాఫీ కాలేదు. ఇటు సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మానసికంగా ఆందోళన చెందాడు. మంగళవారం కథలాపూర్‌లో రైతులతో ధర్నాలో పాల్గొన్నాడు. నాయకులు ప్రసంగిస్తుండగానే.. రుణమాఫీ చేయకపోతే తాను చనిపోతానంటూ నినదించాడు. తన వెంట తెచ్చుకున్న పురుగుల నివారణ మందును తాగేందుకు యత్నించాడు. అక్కడున్న రైతులతో పాటు ఎస్ఐ నవీన్‌కుమార్ అప్రమత్తమై, రైతు చేతిలో నుంచి పురుగుల మందు డబ్బా లాక్కెళ్లారు.



కథలాపూర్‌లో ధర్నా వద్ద పురుగుల మందు డబ్బాతో రైతు సాగర్‌రెడ్డి



కథలాపూర్: ధర్నాలో పాల్గొన్న రైతులు, నాయకులు

## కథలాపూర్‌లో ధర్నా

కథలాపూర్, ఆగస్టు 20 : కథలాపూర్ మండలకేంద్రంలోని కోరుట్ల–వేములవాడ రోడ్డుపై పెద్ద సంఖ్యలో రైతులు ధర్నా చేశారు. 'రుణమాఫీ పేరిట రైతులను దగా చేసిన కాంగ్రెస్ డౌన్ డౌన్' 'అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ డౌన్ డౌన్', 'దైవ ద్రోహానికి పాల్పడ్డ సీఎం డౌన్ డౌన్' 'ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి' అంటూ రాసిన ప్లకార్డులను మహిళా రైతులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నినాదాలతో హోరెత్తించారు. అనంతరం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు వినతిప్రతం ఇచ్చారు. ధర్నాలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

### పాలన చేతకాకపోతే గద్దె దిగిపో

రైతులకు రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసింది. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి. ముఖ్యమంత్రికి పాలన చేతకాకపోతే గద్దె దిగిపోవాలి. దేవుళ్లపై ప్రమాణం చేసి రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేశారు. రైతు భరోసా నిధులు వెంటనే మంజూరు చేయాలి. పచ్చని పంట పొలాల మధ్య ఉండాల్సిన రైతులను రోడ్డు మీదకు తెచ్చిన కాంగ్రెస్ సర్కారుకు ఉసురు తగులుతుంది. సీఎం గాలి మాటలు చెప్పి రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు.

**- లోకబాపురెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్, (కథలాపూర్)**

### దేవుడి మీద ఒట్లు పెట్టిండ్రు

ఆగస్టు 15 కల్లా రైతులందరికీ రుణాలు మాఫీ చేస్తామంటూ ఎక్కడికి వెళ్తే అక్కడి ప్రముఖ దేవుళ్లపై ఒట్లు పెట్టిండ్రు. అమలు సమయం వచ్చేసరికి మాట మారుస్తుండ్రు. కొంచెమైనా సిగ్గులేదా..? మాఫీకి ఇచ్చిన గడువు కూడా అయిపోయింది. కాలయాపన చేసేందుకు ఏవేవో కారణాలు చెబుతున్నరు. పట్టా పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులు, అవసరమైన పత్రాలు సక్రమంగా ఉంటేనే బ్యాంకు వాళ్లు లోన్లు ఇస్తరు. రుణమాఫీకి వచ్చేసరికి సాంకేతిక లోపం, ఇంకేవో సాకులు చెబుతూ రైతులను మోసం చేసే కుట్ర చేస్తున్నరు. భేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలి.



**- మారు జనార్దన్‌రెడ్డి, కోనరావుపేట (మెట్‌పల్లి)**



శ్రీనివాస్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడు

### రాఘవపేటలో ఇంట్లోనే ఆమరణ దీక్ష

మల్లాపూర్, ఆగస్టు 20 : రుణమాఫీ విషయంలో వ్యవసాయ, బ్యాంక్ అధికారుల దగ్గరికి వెళ్తే సరైన జవాబు రావడంలేదని విసుగు చెందిన మల్లాపూర్ మండలం రాఘవపేటకు చెందిన రైతు సోమ శ్రీనివాస్ తన ఇంట్లోనే ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన భార్య సోమ లత పేరు మీద ఉన్న మూడెకరాల పట్టా పాసు పుస్తకాన్ని పక్క గ్రామమైన ముత్యంపేటలోని ఇండియన్ బ్యాంక్‌లో పెట్టి రెండేళ్ల క్రితం రూ.లక్ష రుణం తీసుకున్నానని చెప్పాడు. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో ప్రకటించిన రుణమాఫీ జాబితాల్లో ఈ బ్యాంక్ పరిధిలోని తన భార్యతో పాటు చాలా మంది రైతులకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్ని సార్లు బ్యాంక్, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగినా నో డాటా ఫౌండ్ అని వస్తుందని, సాంకేతిక సమస్య ఉందని అధికారులు చెబుతున్నారని వాపోయాడు. ఇప్పటికైనా తన భార్యతోపాటు ఇలాంటి సమస్యలు ఉన్న ప్రతి రైతుకు మాఫీ అందించాలని ఆమరణ నిరాహారదీక్ష చేపట్టినట్లు తెలిపాడు. శ్రీనివాస్‌ను ఆర్ఐ సురేశ్‌కుమార్, ఏఈవో సంధ్య వచ్చి శాంతింపజేసినప్పటికీ ఫలితం లేదు. దీక్షకు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు సంఘీబావం ప్రకటించారు. కాగా, సాయంత్రం విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ ఏడీఏ లావణ్య, ఎస్ఐ కిరణ్‌కుమార్ శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు పండ్ల రసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



అంబారిపేట రైతువేదిక వద్ద ధర్నా చేస్తున్న రైతులు

### అంబారిపేట రైతువేదిక వద్ద నిరసన

జగిత్యాల రూరల్, ఆగస్టు 20 : జగిత్యాల అర్బన్ మండలంలోని అంబారిపేట రైతువేదిక వద్ద రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామంలో 300 మంది రైతులుంటే మూడు విడతల్లో కలిపి కేవలం 50 మందికే మాఫీ జరిగిందని మండిపడ్డారు. మొదటి విడతలో ₹10 వేలు, ₹80 వేలు ఉన్న రైతులకు కూడా పూర్తి స్థాయిలో మాఫీ కాలేదన్నారు. బ్యాంకులకు వెళ్లి అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని, ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. రేషన్‌కార్డుకు సంబంధం లేకుండా అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.




ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న మహిళా రైతు సరోజన



## చిగురుమామిడిలో రాస్తారోకో

చిగురుమామిడి, ఆగస్టు 20: రైతులందరికీ రుణమాఫీ చేయలేని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని చిగురుమామిడి మండలానికి చెందిన సుమారు 150 మంది రైతులు అల్టిమేటం జారీ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బూటకపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు సంఘీభావం ప్రకటించి, నిరసన తెలిపారు. ఆందోళన తీవ్రం కావడం, హుస్నాబాద్ కరీంనగర్ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆందోళన విరమించాలని కోరినా శాంతించకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిగతా రైతులు తహసీల్ ఆఫీస్‌కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, పార్టీ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ కర్వేద మహేందర్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, నాయకులు పాల్గొన్నారు.



చిగురుమామిడి: రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు